క్లుప్తంగా

సీసీ రోడ్లకు ఎమ్మెల్యే అన్నా శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

అర్ధవీడు (కంభం): మండలంలోని మొహిద్దీన్ పురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం భూమిపూజ చేశారు. రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

మాలమహానాడు అధ్యక్షుడిగా సాయి



నియామక పత్రాన్ని అందుకుంటున్న సాయి

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలోని ఎస్సీ కాలనీకి చెందిన మంచా సాయి మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బేస్తవారిపేట పాత సినిమాహాల్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నియామకపత్రాన్ని పల్నాడు జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు కొమ్ము తోటి పోలు అందజేశారు. ఈ సందర్భంగా సాయి రాష్ట్ర అధ్యక్షుడు జి.చెన్నయ్య, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండ నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షుడు కె.సుధాకర్, గౌరవ అధ్యక్షుడు సాల్మన్, నాయకులు రాజేష్, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి శాంతి కళ్యాణం అర్చకులు శనివారం కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించింది. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కెశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



మార్కాపురం టౌన్: ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి



కొనకనమిట్ల:రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు

శ్రీవారికి ప్రత్యేక పూజలు

కొనకనమిట్ల: గోవిందా..గోవిందా అంటూ మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వెన్నపూస పెద్దపుల్లారెడ్డి, వసంత, దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

మంత్రి సురేష్‌ను సన్మానించిన సెర్ప్ ఉద్యోగులు



మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సన్మానిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు జీతం పెంచుతూ జీవో నంబర్ 64 విడుదల చేసిన సందర్భంగా వారు శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. 23 శాతం జీతాన్ని పెంచుతూ జీవో విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్‌డీఏ–వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఏపీఎంలు వెంకటయ్య, పోలయ్య, కృపమ్మ, శ్రీనివాసులు, ఎడ్వర్డ్, సీసీలు షేక్ ఇబ్రహీం, వై.జ్యోతి, నాగయ్య, శ్రీనివాసులు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

నాశిరకంగా పాఠశాల అభివృద్ధి పనులు

రాచర్ల: ఈ ముఖద్వారాన్ని చూసి నివాసమని అనుకుంటున్నారా..అయితే పొరాపాటే..అది పాఠశాల భవనానికి సంబంధించిన ప్రధాన ముఖద్వారం. మండలంలోని చోళ్లవీడు పంచాయతీ పరిధి అక్కపల్లె ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులకు రెండో విడుతలో నాడు–నేడు పథకం ద్వారా రూ.12 లక్షలు మంజూరు చేశారు. పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయుడు పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా రెండు బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్మాణం, పాఠశాల భవనం పైకప్పు సిమెంటుతో కూడిన శ్లాబు వేయించారు. ఇప్పటి వరకూ పనులు పూర్తికాకపోయినా రూ.3.50 లక్షల వరకు బిల్లులు తీసుకున్నారు. బాత్ రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు పాఠశాల భవనం నిర్మాణానికి ప్లాస్టింగ్ చేయకుండా వదిలేశారు. పాఠశాల భవనం నిర్మాణంలో నాశిరకంగా పనులు చేయడమే కాకుండా ఇష్టరాజ్యంగా పనులు చేయించారు. పాఠశాల గదికి సంబంధించిన ప్రధాన ముఖద్వారం పాత నివాస గృహాలకు వాడిపడేసిన ముఖద్వారంతో పాటు కిటికీలను అమర్చి వదిలేశారు. నాడు–నేడు పనులను పరిశీలించే అధికారులు పత్తాలేకుండా పోవడంతో పాఠశాల పూర్తిస్థాయి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఒకే గదిలో రెండో తరగతి చదివే విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ స్కూల్ చిన్నారులు కలిసి ఉంటున్నారు. ఈ విషయంపై ఏంఈవో గిరిధర్‌శర్మకు వివరణ కోరగా ప్రస్తుతం తాను గుడిమెట్ట పంచాయతీ వార్డు ఎలక్షన్ కోసం రిటర్నింగ్ అధికారిగా ఉన్నానని, ఎలక్షన్ పూర్తికాగానే అక్కపల్లె స్కూల్లో జరుగుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులను పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.



నాశిరకంగా నిర్మించిన పాఠశాల భవనం



ప్రధాన ముఖద్వారం, కిటికీలు ఇలా..

సర్పంచ్ కుమారుడికి ఎమ్మెల్యే కేపీ నివాళి



రమేష్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం రూరల్: మండలంలోని రామచంద్రాపురం సర్పంచ్ లక్ష్మయ్య కుమారుడు రమేష్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి రమేష్ మృతదేహానికి నివాళులర్పించి సర్పంచ్ కుటుంబాన్ని ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులతో పాటు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మండ్లా రామాంజనేయులు, న్యాయవాది కాశయ్య ఉన్నారు. పట్టణంలోని 34వ వార్డు సచివాలయ కన్వీనర్ లూకరాజు తల్లి మృతి చెందటంతో ఆమె భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులర్పించి లూకా కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు ఉన్నారు.

ప్రతీ పంచాయతీలో మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సర్పంచ్ కృష్ణారెడ్డి



కేజీబీవీలో మట్టి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు



జెండా వందనం చేస్తున్న సర్పంచ్ పెద్దమస్తాన్



మాజీ సైనికుడిని సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

బేస్తవారిపేట: ప్రతి పంచాయతీలో ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కె.గురువరకుమార్ అన్నారు. శనివారం మండలంలోని చెట్టిచర్లలో నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పీఎం, సీఎం సందేశాలను నమోదు చేసిన శిలాఫలకాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ ఆవరణలో 100 మొక్కలు నాటారు. సర్పంచ్ పోతుల వెంకట కృష్ణారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు చెన్నకేశవరెడ్డి, ఎన్ఆర్‌ఈజీఎస్ ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల: ఆజాదికా అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న నాభూమి–నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం అన్నీ గ్రామాల్లో విజయవంతం చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం మండలంలోని గట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఆజాదికా అమృత్ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు, వారిని ఉత్తేజ పరిచేందుకు ఆజాదికా అమృత్ మహోత్సవ వేడుకలు వంటి కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం నేలతల్లికి పూజా కార్యక్రమాలు నిర్వహించి మట్టితో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పలు రకాల మొక్కలు నాటించారు. ఎంపీటీసీ ఉడుముల రామనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, పంచాయతీ కార్యదర్శి ప్రసాదు, ఏపీఓ బుల్లెన్న, ఈసీ శ్రీనివాసరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

త్రిపురాంతకం: దేశం కోసం పనిచేసిన మహనీయులు మనకు ఆదర్శమని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నా భూమి– నాదేశం కార్యక్రమం మండలంలోని దూపాడు సచివాలయం వద్ద నిర్వహించి మాజీ సైనికోద్యోగిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ శైలజ, ఎంపీటీసీ శారద, ఏపీఓ సుజాత, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య పాల్గొన్నారు.

కంభం: మండలంలోని జంగంగుంట్ల, కందులాపురం, పెద్దనల్లకాల్వ, చిన్నకంభం, దరగ గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. జంగంగుంట్లలో శిలాఫలకాన్ని ఎంపీడడీఓ సయ్యద్ మస్తాన్‌వలి ఆవిష్కరించారు. ఏపీఓ ఏడుకొండలు, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమిదిన్నె చెన్నారెడ్డి, సర్పంచ్‌లు, టీఏలు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి, జగన్నాథపురం, మంగలకుంట పంచాయతీల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న నా భూమి నా దేశం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 75 మొక్కలు నాటి మట్టి దీపాలతో పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జవాన్లను సన్మానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు సూరెడ్డి రామసుబ్బారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పెద్ద మస్తాన్, గంటా వెంకటరెడ్డి, పిన్నిక శారద, నాయకులు మల్లారెడ్డి, గుమ్మా రాజేంద్ర ప్రసాద్, ఏసురత్నం, సీహెచ్ రమేష్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాధానం చెప్పలేకపోతే సమావేశాలెందుకు?

● అధికారుల పనితీరుపై ఎంపీపీ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు (ముండ్లమూరు): ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోతే అలాంటి సమావేశాలెందుకని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశం ప్రారంభంలో గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు తమ ప్రగతి నివేదికలను వినిపించారు. మొదట రెవెన్యూ అధికారులెవరూ సమావేశానికి హాజరు కాలేదు. గృహ నిర్మాణశాఖపై సమీక్ష సందర్భంగా రజానగరం సర్పంచ్ ఆరు నెలలుగా నూతన గృహాలు మంజూరు కాకాపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతుండగా రామభద్రపురం సర్పంచ్ ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించలేక పోవడానికి కారణాలు తెలియజేయాలని కోరగా ఏఈ చెప్పిన సమాధానంతో సబబుగా లేదన్నారు. సమావేశానికి రెండు రోజుల ముందు నీరు సరఫరా చేస్తే సమస్య పరిష్కరించినట్లేనా అని ప్రశ్నించారు. ఆరు నెలలుగా ప్రజలు ఇబ్బందులు పట్టలేదా అన్నారు. రజానగరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చేయకుండా పంచాయతీ కార్యదర్శి కాలయాపన చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలానికి 797 ఇళ్లు మంజూరు కాగా నాలుగేళ్లలో కేవలం 147 పూర్తి చేస్తే ప్రజలకు ప్రజాప్రతినిధులు ఏమి సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు. ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సక్రమంగా సమాధానం చెప్పే వారు లేనపుడు ఈ సమావేశాలెందుకని ప్రశ్నించారు. వారు సమావేశానికి హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంపీడీఓపై లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించడం వలన ఎవరికీ ఏమీ ఒరిగేది లేదన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు లేక పోతే గ్రామ స్థాయి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని నిలదీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రత్యేకంగా నోట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్దేశ పూర్వకంగానే ఎంపీడీఓ ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఇలా అయితే సమావేశాలెందుకని జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు యిడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లుతో కలిసి సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో సమావేశాన్ని ముగిస్తున్నట్లు ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు ప్రకటించారు. పంచాయతీరాజ్ డీఈ విఠల్‌రాథోడ్, తహసీల్దార్ కేవీ ప్రసాద్, ఏఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సమావేశం: ఎంపీడీఓ వై.శ్రీనివాసరావు

ప్రభుత్వ నిబంధనల మేరకే సమావేశం నిర్వహించామని ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరవుతారన్నారు. సమస్యలను సంబంధిత శాఖల అధికారులు నోట్ చేసుకొని విచారణ చేపట్టి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

శాకాహారంతో ఆరోగ్యానికి మేలు



శాకాహారంపై అవగాహన ర్యాలీ

కొమరోలు: ప్రతి మానవుడు శాకాహారం తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని శివసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్ సుబ్బారావు తెలిపారు. స్థానిక శివసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం నుంచి ప్రధాన రహదారి మీదగా శాకాహారం తీసుకుంటే ఆరోగ్యానికి మేలని కోరుతూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి నెలలోని 2వ శనివారం శాకాహార దినోత్సవంగా పరిగణించి ప్రజలకు శాకాహారంపై పిరమిడ్ ధ్యానకేంద్రంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శాకాహారంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, తప్పనిసరిగా వాటినే తీసుకోవాలని ప్రజలకు సూచించారు. గంగినాయుడు, వెంకటేశ్వర్లు, జయరామయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

పొదిలి: స్థానిక చిన్న బస్టాండ్ సెంటర్‌లో శనివారం రాత్రి ద్విచక్ర వాహనదారులకు ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలు పార్కు చేసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనం నడపటం ద్వారా ప్రమాద సమయంలో రక్షణ ఉంటుందని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. ట్రిపుల్ రైడ్, సరైన పత్రాలు లేకుండా ఉంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ఎన్‌ఎస్‌పీ స్కాలర్‌షిప్‌నకు పేస్ విద్యార్థుల ఎంపిక



స్కాలర్‌షిప్‌లు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, తదితరులు

ఒంగోలు టౌన్: నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) స్కాలర్‌షిప్‌నకు పేస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 77 మంది ఎంపికవడంతో శనివారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ వారిని అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేల చొప్పున నాలుగేళ్లపాటు అందజేస్తారని తెలిపారు. ఇంటర్మీడియట్, బీటెక్‌లో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేసినట్లు వివరించారు. దేశంలోని ఏ కళాశాలకు చెందిన విద్యార్థులూ ఇంతపెద్ద సంఖ్యలో ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపికవలేదని తెలిపారు. ఈ ఘనత సాధించిన పేస్ కాలేజీ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. గత నాలుగు సంవత్సరాలుగా పేస్ విద్యార్థులు వివిధ సంస్థల నుంచి రూ.7 కోట్ల మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు, ఏఓ ఎం.రమణబాబు, స్కాలర్‌షిప్ ఇన్చార్జి కె.సాజన్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం



కంటి పరీక్షలు చేస్తున్న శాంతిరామ్ వైద్యులు

పెద్దదోర్నాల: దాతల సహకారంతో వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు గుమ్మా యల్లేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఫాదర్ ఫెర్రర్ ఆడిటోరియంలో సన్నిధి రాజారావు హేమ ఆదరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మెగా కంటి వైద్య శిబిరం, గుండె (ఈసీజీ) చెకప్, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యల్లేష్ మాట్లాడుతూ సన్నిధి రాజారావు హేమ ఆదరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ చిత్తూరి హారిక మాట్లాడుతూ సన్నిధి రాజారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏదో ఒక కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల నుంచి దాదాపు 200 మంది వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజ్, జనరల్ హాస్పిటల్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారు. వారిలో శస్త్ర చికిత్స కోసం 100 మందిని ఎంపిక చేసి వారిని నంద్యాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, పంచాయితీ ఈఓ మోహనరావ్, సన్నిధి కిశోర్‌కుమార్, సన్నిధి కరుణాకర్ పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్ల పరిశీలన

కొత్తపట్నం: మండలంలో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్లను ఎన్ఆర్‌ఈజీఎస్ పీడీ శీనారెడ్డి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి శనివారం పరిశీలించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమకూర్చిన పొక్లెయిన్‌తో నెల రోజుల నుంచి చేస్తున్న పనులను వారు పరిశీలించారు. గ్రావెల్ రోడ్లు వేయడానికి ముందుగా చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించి డొంకలు ఎత్తుపల్లాలను లెవలింగ్ చేసేందుకు ఎంపీ మాగుంట పొక్లెయిన్‌ను ఉచితంగా ఏర్పాటు చేశారని వారు తెలిపారు. తద్వారా కాంట్రాక్టర్ కూడా ముందుకు రావడంతో గ్రావెల్ రోడ్లు పూర్తవుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. పాదర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఇరిగేషన్ చెరువు వరకు, రంగాయపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఇరిగేషన్ చెరువు వరకు గ్రావెల్ రోడ్లను పరిశీలించారు. ఎంపీపీ లంకపోతు మాట్లాడుతూ ఇరిగేషన్ చెరువు కట్టపై గ్రావెల్ రోడ్డు వేయాలని పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వారి అనుమతి తీసుకున్న తర్వాత రోడ్డు వేయాలని అధికారులను పీడీ ఆదేశించారు.

ఆర్యవైశ్య మహాసభ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా నాగరాజు



చాటకొండ నాగరాజు

మార్కాపురం: ఆర్యవైశ్య మహాసభ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా మార్కాపురం పట్టణానికి చెందిన చాటకొండ నాగరాజును నియమిస్తూ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ఉత్తర్వులు ఇచ్చారు. నాగరాజు ప్రస్తుతం ఆర్యవైశ్య యువజన సంఘం నాయకునిగా ఉన్నారు. ఆయన తండ్రి రామయ్య శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్‌గా, ఆయన సోదరుడు చంద్ర ప్రస్తుతం కౌన్సిలర్‌గా ఉన్నారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఎంఎస్ఎంఈ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మేడా వెంకట బద్రీనాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నాయీ బ్రాహ్మణ సంఘం ఏకగ్రీవ ఎన్నిక



అధ్యక్షునిగా ఎన్నికైన మస్తానయ్య

దొనకొండ: స్థానిక ప్రసన్నాంజనేయ దేవస్థానంలో నాయీ బ్రాహ్మణ సంఘ ఎన్నిక ఏకగ్రీవంగా శనివారం జరిగింది. గౌరవ అధ్యక్షుడు బొమ్మలాపురం వెంకటయ్య ఆధ్వర్యం ప్రక్రియ చేపట్టారు. అధ్యక్షునిగా ఇడుమకంటి మస్తానయ్య, ఉపాధ్యక్షునిగా గుడిపాటి శ్రీను, సెక్రటరీ గుడిపాటి నాసరయ్య, అసిస్టెంట్ సెక్రటరీ బొమ్మలాపురం అంజి, కోశాధికారి గుడిపాటి రఘుపతిని ఎన్నుకున్నారు.